janodaya
# జనోదయ
RNI No - APTEL/2022/81596
కరీంనగర్ సోమవారం 25.05.2026 సంపుటి : 03 సంచిక : 166 పేజీలు : 08 వెల : రూ.5
Karimnagar Monday 25.05.2026 Volume: 03 Issue 166 Pages 08 Cost 5/
తెలుగు దినపత్రిక

## మెరిసిన రాహుల్, కుల్దీప్.. చివరి పంచ్ ఢిల్లీదే..!



4లో..

ఏపీలో చంద్రబాబు అణచివేత చర్యలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నియంతలా మారిన చంద్రబాబు పోలీసు రాజ్యాన్ని నడిపిస్తున్నారని ట్విటర్‌లో ఆరోపించారు.

# నియంతలా చంద్రబాబు

- అణచివేత చర్యలతో ఏపీతో ప్రజాస్వామ్యం ప్రమాదం
- ప్రశ్నిస్తున్న గొంతులను నులుమతున్నారు
- ప్రొ. నాగేశ్వర్‌పై దగ్గరుండి కేసులు పెట్టించడం దారుణం
- అణచివేత పాలనతో ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో



"వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి"

**అమరావతి :** ఏపీలో చంద్రబాబు అణచివేత చర్యలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నియంతలా మారిన చంద్రబాబు పోలీసు రాజ్యాన్ని నడిపిస్తున్నారని ట్విటర్‌లో ఆరోపిం చారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టుల గొంతు నులుముతున్నారని వెల్లడించారు. గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం మామిళ్లపల్లెలో కాపు సామాజిక వర్గానికి చెందిన రైతుల పరామర్శకు వెళ్తున్న వైసీపీ నేతలు జోగి రమేష్, జూపూడి ప్రభాకర్, వరికూటి అశోక్‌బాబు, పీట నాగ మోహన్ కృష్ణ, అంబటి మురళి తదితర నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దాడి అత్యంత హేయమని అన్నారు.. శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి వెళితే చంద్రబా బుకు బీపీ ఎందుకు వస్తోంది ? అంత ఫ్రస్టేషన్ ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నిం చారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ, నిత్యం ప్రజా గొంతుకై నిలిచే ప్రొ. నాగేశ్వర్‌పై దగ్గరుండి కేసులు పెట్టించడం దారుణం కాదా? అని అన్నారు. మొక్కజొన్న కనీస ధర రూ.2,400 అయితే ఈ ఏడాది రూ.1,400– రూ.1,600 లు కూడా రాలేదని పేర్కొన్నారు. తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో గ్రామంలో కొంత మంది కాపు సామాజిక వర్గానికి చెందిన రైతులు తమ మొక్కజొన్న పంటను, తమకు సంబంధించిన రైతు గోడౌన్‌లో నిల్వచేసుకుంటే, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర తన అనుచరులతో దాడులు చేయిం చారని ఆరోపించారు. ఆ రైతులపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించారని వెల్లడిరారు. ప్రతిపక్షం గొంతు నొక్కి, పోలీసు లను రాజకీయ ఆయుధంగా వాడుకుంటూ ఎంత కాలం పాలి స్తారని అన్నారు. ప్రభుత్వ అక్రమాలు, అణచివే తలు, కక్షసాధింపులపై తమ పోరాటం ఆగదని, ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ ఎప్పటికీ గళం విప్పుతూ ఉంటుందని, ప్రజలకు అండగా ఉంటుందని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## వెలుగులోకి గణపతి దేవుడి శిల్పం

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో గుర్తించిన పురావస్తు పరిశోధకులు



4లో..

## ఉచిత విద్యుత్తు రద్దు.. కరెంట్ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర




4లో..



5లో..

## ముంబైపై ఘన విజయంతో
# ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్
### ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్‌కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది.

# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి
## అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దు
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పౌర సరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లపై ఆదివారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

**హైదరాబాద్, మే24:** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పౌర సరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లపై ఆదివారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రైతులకు చెల్లింపుల పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు.తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుకు నష్టం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదన్నారు. కాంటా కోసం వేచి ఉన్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో ఆందోళన చెందవద్దని.. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకుంటే.. మిల్లర్లు, కొనుగోలు సిబ్బందిపై కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.రైతుల్లో గందరగోళం సృష్టించవద్దంటూ అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఖరీఫ్, రబీ కలిపి రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లింపులు చేశామన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని గణాంకాలతో సహా ఆయన వివరించారు. ఈసారి మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిర్దేశించుకుందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,749 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

# మరణమృదంగం



**వడదెబ్బతో పిట్టల్లా రాలిపోతున్న జనం**
**కోల్ బెల్ట్‌లో మూడు రోజుల్లో సుమారు 10 మంది మృతి**
**డీ-హైడ్రేషన్ కారణమంటున్న వైద్యులు**
**నిప్పుల వర్షంలో బయటికి రావద్దని సూచన**



జనోదయ : గోదావరిఖని

కోల్ బెల్ట్ పారిశ్రామిక ప్రాంతంలో నిప్పుల వర్షం కురుస్తుంది. భానుడి భగభగకు జనం విలవిలలాడుతున్నారు. ఎండవేడమిని తట్టుకోలేక జనం పిట్టల్లా రాలిపోతున్నారు. 'రవి' తన నిజ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. 'రవి' కోపోద్రోక్తుడై జనంపై విరుచుకు పడుతున్నాడు. రోజురోజుకు తన వేడిని పెంచుకుంటూ జనాలను ఇంటినుంచి బయటికి వెళ్ళనీయడం లేదు. అయితే కోల్ బెల్ట్ ప్రాంతంలో మిగితా ప్రాంతాల కంటే ఎండవేడి చాలా ఎక్కువ నమోదవుతుంది. ఇప్పటికే 46 డిగ్రీలు దాటింది. అయితే బొగ్గు బాయుల ప్రాంతంలో 50 డిగ్రీల వరకు ఉంటుంది. ఇక ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ల వద్ద 55 డిగ్రీలు ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మొదటి, రెండవ షిఫ్ట్ కార్మికులు డ్యూటీలకు వెల్లడానికి జంకుతున్నారు. ఇక ఓపెన్ కాస్ట్ లలో కార్మికుల హాజరు శాతం గణనీయంగా పడిపోయింది. ఇది బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అసలే బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడ్డ సింగరేణి భానుడి భగభగతో మరింత వెనుకకు నెట్టివేయబడింది. ఇదిలావుండగా ఇక సాధారణ జనం ఎండ వేడిమికి తట్టుకోలేక పోతున్నారు. ఎండలో తిరిగితే చాలు చావును కొని తెచ్చుకున్నట్టే అవుతుంది. మూడు రోజుల వ్యవధిలో సుమారు 10 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో అధికులు సాధారణ కూలీలు ఉన్నారు. ఆదివారం తాజాగా సంపత్ అనే మెకానిక్ వడదెబ్బతో మృత్యువాత పడ్డాడు. ఎండలో తిరగడం వల్ల డి-హైడ్రెస్షన్ కు లోనై శరీరంలో నీరు సరిపడ లేక రక్త ప్రసరణ ఆగి పోయి మృతి చెందుతున్నారు. రానున్న వారం రోజులు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో జనం ఇళ్ల నుంచి బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## సవరించిన కనీస వేతనాలను పునఃపరిశీలన చేయాలి

### ఇఫ్టు డిమాండ్

జనోదయ : గోదావరిఖని

భారత కార్మిక సంఘాల సమస్య (ఇఫ్టు) పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షులు ఈ నరేష్ అధ్యక్షతన గోదావరిఖని సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టీ యు. రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ మాట్లాడుతూ... సుమారు దశాబ్దన్నర కాలంగా కనీస వేతనాలు సవరింపు కోసం నిరీక్షిస్తున్న కార్మికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరాశే మిగిలించిందన్నారు. కార్మికులు ఉన్న వేతనాల్లో కోతనే ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. రెండేళ్లుగా కనీస వేతనాలను సవరించండి అని జీవోలను విడుదల చేయండి అంటూ 73 రకాల షెడ్యూలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. వివిధ రూపాలలో ఆందోళనలు ధర్నాలు కార్యక్రమాలు చేపట్టారు ఫలితంగా దేశంలో ఎక్కడలేని విధంగా దేశానికే ఆదర్శవంతమైన రీతిలో కనీస వేతనాలను శాస్త్రీయ పద్ధతిలో సవరించి అమలు చేస్తానని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని వారి జీవన ప్రమాణాలను దెబ్బతీసే రీతిలో కనీస వేతనాలను సవరించడం అత్యంత అన్యాయమైన చర్య అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కార్మిక జీవితాలు అంటే జీవన ప్రమాణాలు అంటే అపహాస్యం అవహేళన అందుకే కనీస వేతనాలు పెంపుకు ప్రతిపాదికను, ప్రామాణికతలను పట్టించుకోలేదని అంతేకాదు కనీస వేతనాలను రాష్ట్రంలో మూడు జోన్లుగా విభజించడం గ్రామీణ ప్రాంతాలు మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్ గా విభజించి వేతనాలను వేరువేరుగా ప్రకటించడం అత్యంత దుర్మార్గమైనదని అన్నారు. ఈ జోనల్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఈ చర్యను ఐఎఫ్టియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చేసిన వేతనాల సవరింపు విధానాన్ని పునర్ పరిశీలన చేయాలని కనీస వేతనం 26,000 ఉండే విధంగా నిర్ణయించి అమలు చేయడానికి వీలుగా సవరించాలని జోనల్ విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతన సవరింపులో వీడియేను పరిగణములోకి తీసుకోవాలని ఐఎఫ్టియు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈ నరేష్, బి అశోక్, చిలుక శంకర్, ఈదునూరి రామకృష్ణ, ఎం దుర్గయ్య, ఐ రాజేశం, జీ మల్లేశం, ఎడ్ల రవికుమార్, ఎస్ ప్రసాద్ లు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



### 25వ డివిజన్ కాంగ్రెస్ నేత జన్ను శ్యామ్ శుభాకాంక్షలు

జనోదయ : వరంగల్ ప్రతినిధి

జన హృదయనేత, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జన్ను శ్యామ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్ను శ్యామ్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న మహేష్ కుమార్ గౌడ్‌కు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, మహిళా కార్యకర్తలందరి పక్షాన మహేష్ కుమార్ గౌడ్‌కు మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ బేస్ బాల్ పోటీలకు విజ్ డమ్ విద్యార్థిని చందన ఎంపిక

### భువనేశ్వర్‌లో ఈనెల 24 నుంచి 28 వరకు జాతీయ స్థాయి పోటీలు

జనోదయ : వరంగల్ ప్రతినిధి

పట్టణంలోని విజ్ డమ్ హై స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఏ. చందన సబ్ జూనియర్ బేస్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా బేస్ బాల్ కార్యదర్శి అర్జున్ తెలిపారు. ఈ విద్యార్థిని ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే జాతీయ క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొంటుందని వెల్లడించారు. చందన జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల డైరెక్టర్ జావేద్ తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఉదయం, సాయంత్రం జాతీయ స్థాయి కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. గతంలో పారా అథ్లెటిక్స్‌లోనూ ఈ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయిలో రాణించడం విశేషమన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని, భవిష్యత్తులో పోలీస్ అధికారినిగా పేరు తెచ్చుకోవడమే తన లక్ష్యమని చందన తెలిపింది. ఎంపికైన విద్యార్థినిని, కోచ్ అన్వేష్‌ను డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, పీఈటీలు ప్రశాంత్ కుమార్, రియాజ్, రాజేష్, మధు, పృథ్వీ తదితరులు అభినందించారు.






# ఎంపీ వేం నరేందర్ రెడ్డి సన్మాన సభలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

### రాజ్యసభలో తెలంగాణ గళమెత్తే నాయకుడు అని ప్రశంస

జనోదయ : వరంగల్ ప్రతినిధి

హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి కి ఘన సన్మానోత్సవ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), ఎంపీలు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే నాగరాజు ఎంపీ నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం అదాలత్‌లోని అమరవీరుల స్థూపానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సిద్ధాంతాలను నమ్మి పనిచేసే నేతల్లో నరేందర్ రెడ్డి ముందుంటారని అన్నారు. పార్టీ-ప్రభుత్వానికి సమన్వయం కల్పిస్తూ.. కార్యకర్తలకు సముచిత స్థానం దక్కేలా కృషి చేశారని కొనియాడారు. తనకు వర్ధన్నపేట టికెట్ రావడంలో, ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేవడంలో నరేందర్ రెడ్డి సహకారం కీలకమని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజ్యసభలో గళమెత్తే లక్షణాలు ఆయనలో ఉన్నాయని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, నియామకాల కోసం సమర్థంగా పోరాడతారని పేర్కొన్నారు. ఇలాంటి నేత రాజ్యసభకు ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు, పీసీసీ ప్రతినిధులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గంగాధర మండలంలో రైతులకు అండగా ఎస్ఐ వంశీకృష్ణ



జనోదయ : గంగాధర

గంగాధర మండలం లో ధాన్యం రవాణాలో లారీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గంగాధర మండల ఎస్ఐ వంశీకృష్ణ స్వయంగా రంగంలోకి దిగారు. మధురానగర్‌లో ఉన్న చెక్‌పోస్ట్ వద్ద లారీలను ఆపి, మండలంలోని ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఉన్న గ్రామాలకు మళ్లించే చర్యలు చేపట్టారు. మిల్లర్లకు వడ్లు తరలించేందుకు లారీలు అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ వంశీకృష్ణ వెంటనే స్పందించి రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లారీల కొరత ఉన్నప్పటికీ అధికారులు రైతులకు వీలైనంత వరకు సహాయం చేస్తున్నారని తెలిపారు. రైతులు సహనంతో, శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు.

# రాష్ట్రంలో 25 సంవత్సరాలు కాంగ్రెస్ పాలనే

### బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ ఇబ్బందులను ఎదుర్కొంది

### గ్రేటర్ వరంగల్ ఎన్నికలలో సత్తా చాటాలి

### ఆత్మీయ సన్మాన సభలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి

### ఘనంగా ఆత్మీయ సన్మాన సభ

జనోదయ : హనుమకొండ

రాబోయే 25 సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేలా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి  ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలందరూ వేం నరేందర్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేం మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న కాంగ్రెస్.. కార్యకర్తల పోరాట ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా అనేక ప్రాంతాల్లో తనను అభిమానించే ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడామని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా స్వేచ్ఛాయుత పాలన అందిస్తోందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ నిజమైన వేదిక అని, ఆ భావజాలానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం రూ.2200 కోట్లతో 11 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో జనగామ నియోజకవర్గానికీ విస్తరిస్తామని తెలిపారు. కింది స్థాయి కార్యకర్తల కృషివల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో సత్తా చాటాలి..రాబోయే గ్రేటర్ వరంగల్ ఎన్నికలు కొత్త సవాల్ అని, దేశంలోనే జీడబ్ల్యూఎంసీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాజకీయాల్లో ఎదుటివారి మాట వినే ఓపిక, సున్నితత్వం అవసరమని, అదే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. రాజకీయాల్లో అవకాశాలు పొందిన పది శాతం మంది నేతలు మిగతా తొంభై శాతం కార్యకర్తలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జూలై నెలలో మామునూర్ ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే అవకాశముందని, జూన్‌లో టెండర్లు పూర్తవుతాయని వెల్లడించారు. త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు టెండర్లు పిలుస్తామని, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తనకు దేవుడు ఇచ్చిన సోదరుడు, ప్రాణ స్నేహితుడని పేర్కొన్న వేం నరేందర్ రెడ్డి, గత ఏడు ఎనిమిదేళ్లలో ఆయన ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని దగ్గరగా చూశానన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చే ప్రతి ఆదేశాన్ని నమ్మకంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



## పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



### ఎంపీ నరేందర్ రెడ్డికి మడికొండలో ఘన స్వాగతం

జనోదయ : వరంగల్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ 61 వ జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి తొలిసారిగా వరంగల్ విచ్చేస్తున్న సందర్భంగా మడికొండలో కాంగ్రెస్ అగ్రనేతలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి, నల్గొండ రమేష్, గుండేటి నరేందర్, కరాటే ప్రభాకర్, బసవరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేష్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, దూపం సంపత్, జన్ను రవి, గోరంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.




# సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు వీ.హనుమంతరావు

### గంప చంద్ర మోహన్

**జనోదయ : గ్రేటర్ హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు ను ఘన సన్మానించారు.. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు గంప చంద్ర మోహన్ ఆధ్వర్యంలో వీహెచ్‌కు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంప చంద్ర మోహన్ మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాలు, బీసీలు, పేదల హక్కుల కోసం వి. హనుమంతరావు ఎన్నో దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. రాజకీయాల్లో నిబద్ధత, సామాజిక బాధ్యత, ప్రజాసేవకు వీహెచ్ ఒక ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్న నాయకుడు వీహెచ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బందెల జితేందర్, కొరివి వేణుగోపాల్, గంగం రవి, ప్యాట రవీందర్ కుమార్, గడ్డి చంద్ర శేఖర్, గడేకర్ల సత్యనారాయణ, తిరుపతి శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్, కొంతం సురేష్ బాబు, పలుగుల శ్రీనివాస్, హాజరి రామ్మోహన్, బిళ్ళకంటి రవికాంత్, కందికట్ల భాస్కర్, మాడ ప్రమోద్, సిరిగిరి పవన్, మించు ఆనంద్, గోపాల రాధ కృష్ణ, తదితర మున్నూరుకాపు సంఘ నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొని వీహెచ్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా సభలో నాయకులు మాట్లాడుతూ, మున్నూరుకాపు సమాజ అభివృద్ధి కోసం సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వీ. హనుమంతరావు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయ, విద్యా, ఆర్థిక అవకాశాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు. అన్ని మున్నూరుకావు సంఘాలు ఒక్కతాటిపైకి రావాలని సూచించారు. ప్రజల ఆశయాల కోసం తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# మెరిసిన రాహుల్, కుల్దీప్.. చివరి పంచ్ ఢిల్లీదే..!




చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను చిత్తుగా ఓడించి విజయంతో టోర్నీని ముగించింది. రాహుల్(60) అర్ధ శతకంతో భారీ స్కోర్ కొట్టిన ఢిల్లీ.. కుల్దీప్ యాదవ్(3-29), ఎంగిడి(3-27) జోరుతో కోల్‌కతాను కట్టి చేసింది. రహానే(63) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా సహకరించేవాళ్లు కరువయ్యారు. పావెల్() రనౌటవ్వడంతో ఢిల్లీ 40 పరుగుల తేడాతో గెలుపొందింది.పంతొమ్మిదో సీజన్ లీగ్ దశ ముగిసింది. డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జయభేరి మోగించడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ నిరాశగా ఇంటిదారి పట్టింది. డేంజరస్ ఓపెనర్ ఫిన్ అలెన్(20)ను బౌల్డ్ చేసిన ఎంగిడి(3-27) కోల్‌కతాకు షాకిచ్చాడు. కెప్టెన్ అజింక్యా రహానే(63)తో కలిసి దంచేసిన మనీశ్ పాండే(25)ను ఎంగిడి వెనక్కి పంపాడు. సిక్సర్ బాదిన పాండే బౌండరీకి యత్నించి స్టార్క్ డైవింగ్ క్యాచ్‌కు డగౌట్ చేరాడు.అర్ధ శతకం పూర్తి చేసుకున్న రహానే.. పావెల్(29)తో కలిసి గెలుపు బాధ్యత తీసుకున్నాడు. కానీ, కుల్దీప్ యాదవ్(3-29) ఒకే ఓవర్లో రహానే, రింకూ సింగ్(0)లను ఔట్ చేసి కోల్‌కతాను కష్టాల్లోకి నెట్టాడు. అనంతరం.. పావెల్ దూకుడుగా ఆడినా రజ్వీ విసిరిన త్రోకు రనౌటవ్వగా ఢిల్లీ విజయం ఖాయమైంది. స్టార్క్() ఓవర్లో అనుకుల్ రాయ్, కార్తిక్ త్యాగీలు ఔటయ్యారు. చక్రవర్తిని ఎంగిడి చివరి వికెట్‌గా వెనక్కి పంపగా కోల్‌కతా పరిమితమైంది.ప్లే ఆఫ్స్ బెర్తు చేజారిన వేళ ఢిల్లీ క్యాపిటల్స్ ఈడెన్ గార్డెన్స్‌లో భారీ స్కోర్ కొట్టింది. కోల్‌కతా నైట్ రైడర్స్ బౌలర్లను ఉతికేస్తూ ఓపెనర్ కేఎల్ రాహుల్(60) అర్ధ శతకంతో చెలరేగగా.. అక్షర్ పటేల్(39) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడిన ఈ ద్వయం వెనుదిరిగినా.. డెత్ ఓవర్లలో మిల్లర్(28), అశుతోష్ శర్మ(18 నాటౌట్)లు దంచేశారు. ఫలితంగా కోల్‌కతాకు 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది.

# ప్రశాంతంగా ముగిసిన సివిల్స్ ప్రిలిమ్స్

**జనోదయ : హనుమకొండ**



యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష--2026ను హనుమకొండ జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.ఆదివారం నిర్వహించిన పరీక్షల సందర్భంగా హనుమకొండలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ల తనిఖీ, సంబంధిత యాప్ ద్వారా నమోదు ప్రక్రియ, భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలను తనిఖీ చేశారు. అదేవిధంగా యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధికారి శుభం గాడ్, రాష్ట్ర స్థాయి అబ్జర్వర్ టిజిఎన్ పిడిసిఎల్ సిఎండి కె, వరుణ్ రెడ్డిలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పరీక్షా కేంద్రాల్లో నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమయపాలనకు ప్రాధాన్యతనిస్తూ పరీక్ష ప్రారంభానికి ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 4,075 మంది అభ్యర్థుల కోసం పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఉదయం జరిగిన మొదటి సెషన్‌లో 2,762 మంది అభ్యర్థులు హాజరుకాగా, 1,313 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. హాజరు శాతం 67.78గా నమోదైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెషన్‌లో 2,749 మంది హాజరుకాగా, 1,326 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సెషన్‌లో హాజరు శాతం 67.46గా నమోదైనట్లు వెల్లడించారు.ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలోనూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు.

# వెలుగులోకి గణపతి దేవుడి శిల్పం

### సిద్దిపేట జిల్లా తోటపల్లిలో గుర్తించిన పురావస్తు పరిశోధకులు



**హైదరాబాద్, మే 24 :** సిద్దిపేట జిల్లా తోటపల్లిలో కాకతీయ గణపతి దేవుడి శిల్పాన్ని గుర్తించినట్టు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివ నాగిరెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. పురాతన స్థలాలు, చారిత్రక, వారసత్వ కట్టడాలపై గ్రామీణులకు అవగాహన కల్పిం చడంలో భాగంగా ఆదివారం సిద్దిపేట జిల్లాలోని నంగునూరు, కొండ పాక, తోటపల్లి, లకుడారం గ్రామాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా బెజ్జంకి మండలం తోటపల్లిలోని కాకతీయుల కాలంనాటి శివాలయం రంగ మండపంలోని శిల్పం ముమ్మాటికీ గణపతిదేవుడు, ఆయన సతీమణి సోమలదేవి, రాజగురువు విశ్వేశ్వర శివాచార్యులదేనని వెల్లడించారు.రాజగురువు సమక్షంలో శివదీక్ష తీసుకున్న గణపతి దేవుడు రాచరికపు చిహ్నాలను పక్కనబెట్టి తలపై శిఖ, ఒంటిపై రుద్రాక్ష మాలలు ధరించి శివలింగానికి పుష్పాభిషేకం చేస్తుండగా ద్రవిడ తమ్మిళ్ల కేశాలంకరణతో సోమలదేవి పూజలో నిమగ్నమైనట్టు, చక్రవర్తికి కుడివైపున రాజగురువు గోళకి మఠాధిపతి విశ్వేశ్వర శివాచార్యుడు వారితో పూజులు చేయిస్తున్నట్టు ఉన్నారని పేర్కొన్నారు.తెలంగాణలో ఇదే తొలి పురాతన శిల్పమని వెల్లడించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ అంశాన్ని తెలుగు పాఠ్యంశాల్లో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో వారసత్వ ప్రేమికుడు, లాంకో హిల్స్ ఎండీ అండ్ సీఈవో సింహాద్రి వెంకట్రామారెడ్డి, ఆలయ పూజారులు కైలాసపతి, కవిత, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, సామలేటి మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్తు రద్దు.. కరెంట్ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ కుట్ర

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, మే 24 :** మోటర్లకు మీటర్లు పెట్టకముందే.. ప్రతి ఒకరి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురాకముందే కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు తీసివేయాలని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ మోటర్లకు, ఇండ్లకు ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన నిప్పులు చెరిగారు. కేవలం ఉచిత విద్యుత్‌ను ఎత్తేయడానికి, విద్యుత్తురంగాన్ని అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకే రేవంత్‌రెడ్డి సరార్ ఈ కుట్రకు తెరలేపిందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ వస్తే ఉచిత కరెంట్ పోతుందని తాము ఎన్నికల ముందే హెచ్చరించిన విషయాన్ని కేటీఆర్ నొక్కి చెప్పారు.ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోటర్లకు మీటర్లు పెట్టి పూర్తిగా రైతన్నలకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ఎగ్గొట్టడంతో పాటు ప్రతి ఒకరి ఇంట్లో ప్రస్తుతం ఉన్న మీటర్లు తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. గతంలో దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైన ప్రీపెయిడ్ మీటర్లను రాష్ట్రంలో పెట్టాలని ప్రధాని మోదీ తీవ్ర ఒత్తిడి తెచ్చారని, ఇందుకోసం రాష్ట్రానికి రావాల్సిన రూ.30వేల కోట్ల రుణాలను ఆపినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వెనకి తగ్గలేదని కేటీఆర్ గుర్తుచేశారు.రైతుల ప్రయోజనాల కోసం మోదీని ఎదిరించిన ఘనత కేసీఆర్‌ది అయితే.. అధికారంలోకి రాగానే వచ్చే మూడు నెలల్లోనే ఇండ్లు, వ్యవసాయ రంగానికి ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని శనివారం క్యాబినెట్‌లో కాంగ్రెస్ నిర్ణయించడం దారుణమని మండిపడ్డారు. మొబైల్ రీఛార్జ్ తరహాలో కరెంట్ మీటర్లు పెట్టి, పేదలు, రైతుల పొట్టగొట్టే ఈ కరెంటు కుట్రలపై ప్రజలు తిరుగబడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ధాన్యం, వడ్లు, మకలు కొనుగోలు చేయకపోవడంతో ఎకడికకడ రైతులు రోడ్లపైనే ఆరబోసుకుని కూర్చున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఎప్పుడు అవకాశం వస్తే అప్పుడు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ పేర్కొన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి, అడుగడుగునా అరాచకాలు, అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# బంకీపూర్ అసెంబ్లీ స్థానం నుంచి జన్ సురాజ్ పార్టీ పోటీ

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ అసెంబ్లీ స్థానం నుంచి జన్ సురాజ్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాప అధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. బంకీపూర్‌లో బీజేపీని ఓడించే సామర్థ్యం జన్‌సురాజ్ పార్టీకే ఉందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. జన్ సురాజ్ పార్టీ 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి 238 సీట్లలో పోటీ చేసింది. అయితే ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది.అయితే అధికార ఎన్డీయే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఎన్నికలకు ముందు పథకాల పేరుతో ఒక్కో మహిళకు రూ.10,000 చొప్పున ఇచ్చిందని, ఇదే ఎన్నికల ఫలితాలను దెబ్బతీసిందని ఫలితాల అనంతరం ప్రశాంత్ కిషోర్ విశ్లేషించారు. బీజేపీకి దశాబ్దాలుగా కంచుకోటగా ఉన్న బంకీపూర్ నియోజకర్గం నుంచి గతం అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నబిన్ పోటీచేసి వరుసగా ఐదోసారి విజయం సాధించారు. ఆర్జేడీపై 50 వేల ఓట్ల ఆధిక్యంలో ఆయన గెలుపొందగా, జన్ సురాజ్ పార్టీ మూడో స్థానంలో నిలిచింది.అయితే నితిన్ నబిన్ గత జనవరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం రాజ్యసభకు ఎన్నిక కావడంతో గత నెలలో బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేశారు. దాంతో బంకీపూర్‌లో ఆరు నెలల్లోపు ఉపఎన్నిక జరగాల్సి ఉంది. బంకీపూర్ నియోజకవర్గం నుంచి జన్ సురాజ్ పోటీ చేస్తుందని ప్రకటించిన ప్రశాంత్ కిషోర్.. ఆ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీచేసే అవకాశాలపై నేరుగా సమాధానం ఇవ్వలేదు. దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పార్టీ సంస్థాగత పనులపై దృష్టి సారించేందుకే తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదని, పార్టీ సమష్టి నిర్ణయానికే తాను కట్టుబడి ఉంటానని అన్నారు.జన్ సురాజ్ పార్టీ బీహార్ అధ్యక్షుడు మనోజ్ భారతి మాట్లాడుతూ.. నితిన్ నబిన్ జాతీయ అధ్యక్షుడు కావడంతో బంకీపూర్ నియోజకవర్గం ఇప్పుడు వీవీఐపీ సీటుగా మారిందన్నారు. దాంతో బీజేపీ కూడా శక్తివంచన లేకుండా గెలిచేందుకు ప్రయత్నిస్తున్నదని, జన్



సురాజ్ నుంచి గట్టి నేతను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత 20 రోజులుగా నియోజకవర్గ ప్రజలతో మాట్లాడుతున్నామని, ప్రశాంత్ కిషోర్‌ను తమ అభ్యర్థిగా చూడాలని బంకీపూర్ కోరుకుంటున్నట్టు తమ పరిశీలనలో తేలిందని అన్నారు. పార్టీ కార్యనిర్వాహక వర్గం, ప్రశాంత్ కిషోర్ అంగీకరిస్తే ఈసారి పోటీ రసవత్తరంగా ఉంటుందని చెప్పారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# విద్యుత్ వినియోగదారులందరీపై ఆర్డీఎస్ఎస్ పిడుగు

## మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్ :** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులందరీ పై పెను భారం పడే పథకానికి ప్రభుత్వం అంగీకరించడం దారుణమని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కేబినెట్‌లో ఆర్డీఎస్-ఎస్ పథకానికి రేవంత్ సర్కార్ ఆమోదం తెలిపిం దని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కేంద్ర పథకాన్ని తన గొంతులో ప్రాణం ఉండగా ఒప్పుకునేది లేదని గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ అడ్డుకున్నాడని తెలిపారు. కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు తీసుకొచ్చిన అంగీకరించలేదని వెల్లడించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఆర్‌డీఎస్ఎస్ కింద ఇళ్లకు, వ్యవసాయ మోటార్లకు పెట్టిన స్మార్ట్ మీటర్లను అక్కడి ప్రజలు పీకేసి తగలబెడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే స్మార్ట్ మీటర్లను తెచ్చి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టాలని కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆరోపించారు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ల వద్దనే స్మార్ట్ మీటర్లు పెడుతామని అంటూనే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెట్టే అవకాశముందని వివరించారు. పేదలను ఉద్ధరించేందుకు ఆర్డీఎస్ఎస్ కాదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మంచినీళ్ల నల్లాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతారని తెలిపారు. విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ వల్ల రైతులపై, వినియోగదారులపై పెనుభారం పడుతుందని అన్నారు. కాంగ్రెస్ ఒత్తిళ్లతో యూపీ ప్రభుత్వం ఆర్డీఎస్ ఎస్‌ను ఉపసంహరించుకోగా అదే కాంగ్రెస్ తెలంగాణలో అమలుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, రైతులు, వినియోగదారులంతా సంఘటితమై ప్రభుత్వంపై ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**జనోదయ: మాడుగులపల్లి:** మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం పురుషోత్తం రెడ్డి నిర్వహించిన మైసమ్మ తల్లి పండుగ వేడుకలో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు నల్లగొండ డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత లు మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలో కలిసితెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి, మహేష్ కుమార్ గౌడ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ



జెడ్పిటిసి పుల్లెంల సైదులు, సర్పంచులు ఆర్రూరి నరేష్, అండెం రేణుక యాదయ్య, పందిరి మారయ్య, బొమ్మ కంటి కల్పనకిరణ్,జూలకంటి సైదిరెడ్డి, కునుకుంట్ల అంజయ్య, మాజీ సర్పంచ్ లు మంగా యాదగిరి, చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి , అలుగుబెల్లి రామచంద్రారెడ్డి, నాయకులు చేపూరి సత్యనారాయణ, చింతకాయల సతీష్,కాటేపల్లి వెంకన్న, దాసిరెడ్డి వెంకటరెడ్డి, కర్ర వెంకటరెడ్డి, కట్ట కృష్ణారెడ్డి,వడ్డే శ్రీనివాస్ రెడ్డి, గనిపల్లి మోహన్, భూపతి ఉషయ్య,కోడూరు కోటి, బొమ్మకంటి గణేష్, దైద కృష్ణ, వివిధ విభాగాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

## ఏపీ సర్కారుకు హరీశ్‌రావు డిమాండ్



జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైన, కూటమి ప్రభుత్వం పైన ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కే నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు, జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్‌కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది.ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు కూడా చేశారు. దాంతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్.. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు.ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంతమాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే హరీశ్ రావు చేసిన ఈ పోస్టుపై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో చూడాలి.

# ముంబైపై ఘన విజయంతో ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్..

**ఢిల్లీ, పంజాబ్, కోల్‌కతా ఇంటికి**

పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ చివరి బెర్తును రాజస్థాన్ రాయల్స్ పట్టేసింది. ఉత్కంఠ పోరులో అదిరే ఆటతో ముంబై ఇండియన్స్‌కు చెక్ పెట్టిన రాజస్థాన్.. ఎలిమినేటర్ ఆడాలనుకున్న పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఇంటికి పంపింది. వాంఖడేలో జోఫ్రా ఆర్చర్(32, 3-17) ఆల్‌రౌండ్ షోతో ముంబై బెంబేలెత్తిపోయింది. భారీ ఛేదనలో సూర్యకుమార్ యాదవ్(60) ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొట్టనుంది.చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ సమిష్టి కృషితో ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. గెలిస్తేనే ఎలిమినేటర్ బెర్తు దక్కనున్న వేళ జోఫ్రా ఆర్చర్(32, 3-17) చెలరేగాడు. వాంఖడేలో ముంబై ఇండియన్స్ బౌలర్లను బాదేసిన అర్చర్.. అనంతరం



బంతితోనూ ఆ జట్టు బ్యాటర్లను వణికించాడు. బ్రిజేష్ శర్మ(2-26), బర్గర్(2-43) కీలక వికెట్లు తీసి సహకరించగా 8వ విజయం.. 16 పాయింట్లతో రాజస్థాన్ ప్లే ఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది.

విలేకర్లు కావలెను
సీనియర్ జర్నలిస్ట్ మానసాని కృష్ణారెడ్డి సంపాదకత్వంలో
వెలువడుతున్న అశేష పాఠకాదరణ ఉన్న
వాస్తవం
జనోదయ
తెలుగు దినపత్రికలకు
విలేకర్లు కావలెను.


9618616110, 8074124190